# బంగారు కొండ

ఆకాశం మీద తెల్లమబ్బు వేసింది. సన్నసన్నగా తుప్పర ప్రారంభమైంది. అంతలో వెలిసే సూచనలు కనబడటం లేదు. గొడుగులు విప్పుకుని ఆకాశానికీ, భూమికీ మధ్య నల్లదుప్పటి పరుస్తున్నాయి. రిక్షాలు బరువుగా, మెల్లగా గుంటల్లో చిక్కబడ్డ నీళ్ళ బిందువుల్ని చెదర గొట్టుకొంటూ ముందుకు సాగిపోతున్నాయి. అక్కడో పక్షి టపటప రెక్కల చప్పుడు, దూరంగా రేడియోలో సిలోన్‌నుంచి సాయంకాలం వినవచ్చే తెలుగు పాట, ఇక్కడో ముష్టివాడు చలికి వణుకుతూ దీనంగా చేయిచాపి పిలిచే పిలుపు, ఆ సందు మొగదల వర్షపుజల్లుతో కలిసి వాతావరణంలోకి ఒక నిస్సహాయత్వాన్ని, ఓ వింత కృత్రిమత్వాన్ని ప్రవేశపెడుతున్నాయి.

విశాలాక్షి తన బంగారుకొండను నడుము కెత్తుకుని తన మూడు గదుల పెంకుటింటి వరండాలోకి వచ్చింది. ఆ బంగారుకొండ లావుగా, ముద్దుగా, రబ్బరుబంతిలా ఉన్నాడు. తెల్లగా కడిగిన ముత్యంలా ఉన్నాడు. నెత్తిన రంగురంగుల గుడ్డ టోపీతో, ఒంటిన సిల్కు చొక్కాతో, నోట్లో చాక్లెట్‌తో దొరబాబులా ఉన్నాడు. వరండాలో కొయ్యగుర్రం కనబడగానే "అమ్మా! గుల్లం, గుల్లం" అన్నాడు.

విశాలాక్షి కొడుకును గుర్రంమీద కూచోబెట్టి, ఆగుర్రాన్ని ముందుకూ వెనక్కూ ఊపుతూ, "నాన్నా! మీ నాన్నారొచ్చే వేళయింది. నా కింట్లో పనుంది. నాన్నారికి కాఫీ అదీ పెట్టొద్దూ మరి! అందుకని నే నింట్లోకి వెళ్తున్నాను. నువ్వీ వరండాదిగి వానలోకి, నీళ్ళలోకి వెళ్ళొద్దుసుమా! తడిస్తే జ్వరమొస్తుంది మరి" అన్నది.

"జలుబూ, అమ్మో! నాకు మళ్ళే, జలుబంతే భయంగా, వెళ్లొను" అన్నాడు. బంగారుకొండ, భయమంతా కళ్ళలో ప్రతిఫలిస్తుండగా.

విశాలాక్షి పెద్దగానవ్వింది. ఆవిడకు తెలుసు, తన బంగారుకొండకు చీకటన్నా, నీళ్ళన్నా, ఒంటరితనమన్నా, జ్వరమన్నా విపరీతమైన భయమని. ఆ భయం మూలంగా వరండాదిగి ఆ కుర్రవాడు నీళ్ళలోకి వెళ్ళడు. వరండా లోనే కూచుని వచ్చేపోయే మనుష్యుల్నీ, రిక్షాల్నీ, కార్లనూ చూస్తుంటాడు. ఆ ధైర్యంతోనే విశాలాక్షి కుర్రవాడి బుగ్గలు ప్రేమతో పుణికి, చొక్కా సరి జేసి, మరొక్కసారి గుర్రాన్ని అటూఇటూ ఊపి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

విశాలాక్షి లోపలకు వెళుతున్న సమయంలోనే, ఎదురింటి రెండు గదుల పూరిపాకలోంచి జానకమ్మ తన కుర్రవాణ్ణెత్తుకుని, వాకిట్లోకి ముగ్గు పెట్టిన అరుగుమీదకు వచ్చింది. ఆమె తన చంకలోని కుర్రవాణ్ణి క్రిందకు దింపి కూచోపెడుతూ, "విస్సూ! వానలోకి వెళ్ళబోకేం?" అన్నది హెచ్చ రింపుగా. సన్నగా, చామనచాయగా, ఉంగరాల జుట్టుతో, పొడుగాటి చేతు లతో నవ్వుతున్న మొహంతో, గుండ్రని కళ్ళతో, శలాకలా కనిపిస్తున్న ఆ కుర్రవాడు 'ఎళ్ళన్లే!' అన్నాడు. ఆ మాటవిని జానకమ్మ కాంతినిండిన కళ్ళతో వాడివేపు ప్రేమగా చూసింది. 'వెళ్ళవని నాకుతెలుసు. నువ్వెంతో మంచివాడివి. నే చెప్పినమాట ఎంచక్కా వింటావు! నాన్నారొచ్చిందాకా అల్లరి చేయకుండా, బుద్ధిగా ఇక్కడ కూచుంటావు కదూ?' అన్నది లాల నగా. విస్సు తల ఆడించాడు. ఆ తల ఆడింపు చూసి జానకమ్మ లోపలకు వెళ్ళిపోయింది. ఆమె అటు లోపలకు వెళ్ళడంచూసి, విస్సు తను కూచున్న వరండాదిగి మెట్లమీదకు వచ్చాడు. చూరుమీదనుంచి వర్షపునీరు బొట్లు బొట్లుగా క్రిందకు రాల్తోంది ఇంకా. ఉండీలేనట్లే వర్షం పైనుండి క్రిందకు పడుతూఉంది. వీథుల్లో గుంటల్లో నీళ్ళు నిలిచాయి. రోడ్డుకు అటూ ఇటూ నీరు దారి వెతుక్కుంటూ పారుతూంది. చూరుల్లో పిచ్చుకలు రెక్కలు ముడుచుకుని పడుకున్నాయి.

విస్సు తలఎత్తి ఎదురుగా చూశాడు. ఎదురింటి పెంకుటింటి వరం డాలో గుర్రంమీద కూచున్న బంగారుకొండ కనిపించాడు. ఆడుకుంటానికి రమ్మన్నట్లు సైగచేశాడు.

'నే లాను. నాకు బయం' అన్నాడు బంగారుకొండ.

'బయమెందుకూ ? నువ్వేం ఆడమ్మాయివా?'

'నేనేం ఆడమ్మాయిని కాదు.' బంగారుకొండ మూతి ముడుచుకొన్నాడు.

'మగబ్బాయిలు బయపడ్రు.' విస్సు వెక్కిరించాడు.

'బయంకాదు. నాకు జొలం ఒత్తుంది.'

విస్సుకు ఆ మాట అర్థం కాలేదు. 'జొలమంటే?' అనిప్రశ్నించాడు.

బంగారుకొండకు జ్వరమంటే ఏమిటో చెప్పడం చేత కాలేదు. 'జొల మంటే.—జొలమే!' అన్నాడు మొండికెత్తి. అతను సమాధానం చెప్పేలో పలే విస్సు మెట్లుదిగి, వీథిలోకి వచ్చేశాడు. కాళ్ళతో గుంటల్లో తడిసిన నీళ్ళను గర్వంగాచిమ్మేస్తున్నాడు. మొహంమీదపడ్డ వానచినుకుల్ని చొక్కా అంచులతో తుడుచుకొంటున్నాడు. పారుతున్ననీళ్ళకు సన్ననిమార్గాలు చేసి పక్కదార్లు పట్టిస్తున్నాడు. కాగితం ముక్కలు పట్టుకువచ్చి పడవలు చేసి పరుగెత్తే నీళ్ళలో విడిచి వాటితోపాటు తానూ పరుగెడుతున్నాడు. పరిగెడుతూ, పరిగెడుతూ, కళ్ళల్లోపడ్డ చినుకుల్ని తుడుచుకుంటూ, తుడుచుకుంటూ వెనగ్గావచ్చిన ఓ అంబాసడర్ కారును చూసుకోకుండా దానికింద పడబోయాడు. నీళ్ళను చిమ్ముకుంటూ వచ్చిన సరికొత్తమోడల్ అంబాసడర్ కారు సడన్ బ్రేకుతో 'క్రీక్' మంటూ ఆగిపోయింది.

సడన్ బ్రేక్‌తో పరధ్యానంగా వెనకసీట్లో కూచున్న సుందరమ్మ ప్రక్కనేఉన్న భర్త ఒళ్ళో తూలి పడిపోయింది. జగన్నాథం ఆమెను అతి సుతారంగా, ఒడిసి పట్టుకుంటూ అతి దగ్గరగాఉన్న ఆమె కళ్ళల్లోకి అతి ప్రేమగా చూస్తూ, 'బీస్టెడీ!—మైడియర్!' అన్నాడు. సుందరమ్మ సిగ్గు

పడుతూ, మెత్తగా నవ్వుతూ, ప్రక్కకుజరిగి చీర కుచ్చెళ్ళు సర్దుకుంటూ, 'ఏమైందని, డ్రైవర్?' అన్నది హూంకారంగా, కారు ఆగిపోవడం చూసి.

'ఎవరో కుర్రాడు కారుకింద పడబోయాడు, మేమ్‌సాబ్.'

'కుర్రాడా?' సుందరమ్మ కారుడోరు తీసుకుని క్రిందకు దిగ బోయింది.

'ఇంకా జల్లు పడుతోంది, సుందరీ! వర్షపుజల్లు నీ ఒంటికి మంచిది కాదు.' అప్పటికే వెనకనించి జగన్నాథం చేస్తున్న హెచ్చరిక వినిపించనంత దూరం సుందరమ్మ వచ్చేసింది. విస్సు కారుక్రింద పడబోయి తప్పించు కున్న హడావుడిలో పెంకుటింటి వరండాలోకి వచ్చేసి, బంగారుకొండ ప్రక్కన నిలబడి, 'నేనేం బయపళ్ళా! నాకేం బయంలేదు' అంటున్నాడు.

బంగారుకొండ మాత్రం ఆ దృశ్యం చూసినసంభ్రమంలో, 'అమ్మో! కాలు! కాలు! కాలుకింద పత్తే చచ్చిపోతాలు' అంటున్నాడు వణికి పోతున్న గొంతుకతో.

ఇంటిముందు క్రీక్‌మంటూ కారేదో ఆగిన శబ్దంవిని విశాలాక్షి హడా విడిగా లోపలినుండి బయటకు పరిగెత్తుకు వచ్చింది. తన బంగారుకొండా, ఎదురింటి విస్సూ ఎదురెదురుగా నిలబడి ఉన్నారు. అంత చల్లదనంలోనూ బంగారుకొండ మొహంమీద ముత్యాలముగ్గులు పెడుతున్న చెమట బింदు వులు, విస్సు వదనమంతటా సంతృప్తితో కూడినగర్వం, ఇదమిత్థమని చెప్పరాని నిర్లక్ష్యం, వాళ్ళకు దగ్గరగా నిలబడ్డ యౌవనం చెదరని, పట్టు చీరలో పసిడికాంతులు చిందుతున్న ఓ అయిన ఇంటి ఆడబడుచు, ఆమె మెడలోఉన్న రవ్వల నెక్లెస్ ఎర్రరాళ్ళ చెవుల దుద్దులతో పోటీపడి మెరిసి పోతూంది. విశాలాక్షి తన మెడను అప్రయత్నంగా తడుముకొంది. తేలిగ్గా ఉన్న ఒంటిపేట గొలుసు చేతికి తగిలింది. తను కట్టుకున్న చీరతో సుంద రమ్మ చీరను పోల్చి చూసుకొంది. తన కలనేత చీర వెలవెల బోయింది. తన ఒంటిరంగుతో సుందరమ్మ శరీరపు కాంతిని పోల్చుకుంది. తను పాలి పోయింది. తన శరీరంలోని బిగువుకూ, సుందరమ్మ సౌందర్యానికీ పోలికే లేదు. తను ముగ్గురుబిడ్డల తల్లి. కాన్పులతో ముడతలుపడ్డ ఆడతనం తనది. సుందరమ్మ నలగని పుష్పంలాఉంది, వెలిసిపోని ఇంద్రధనుస్సులా

ఉంది, కనులవిందుచేసే పంటపొలంలా ఉంది. ఇన్ని ఆలోచనలు క్షణంలో విశాలాక్షి మనస్సులో కలిగినాయి. ఆలోచిస్తూనే వాకిలివేపు చూసింది ఆమె. వర్షంలో తడుస్తున్న అంబాసడర్ కారు చెదరని తీయని స్వప్నంలా మురిపించింది.

'క్షమించాలి. మా డ్రైవరు అప్రమత్తతవల్ల, మీ అదృష్టం వల్ల, దేవుడి దయవల్ల ప్రమాదం తప్పిపోయింది. మీ అబ్బాయి....'

'వాడు మా అబ్బాయి కాదండీ! ఎదురింటి ప్లీడరు గుమస్తా నరసింహా రావు గారి కొడుకు. ఏరా, విస్సూ!—నువ్వేనా కారుకింద పడబోయిందీ?—ఓరీ వెధవా, మీ అమ్మకు ఎంత కష్టం తెచ్చిపెట్టేవాడివిరా!' విశాలాక్షి సమాధానం చెబుతూ, చెబుతూ మధ్యలో ఆగి, అదే తన కొడుకు అయి తేనా అన్న విషయం జ్ఞాపకంవచ్చి, గుండె గుభిల్లుమనగా, బంగారు కొండను ఒక్కసారిగా ఎత్తుకుని, గుండెలకు అదుముకుంటూ 'నా నాయనే! నా బాబే! ఈ వేళ నే లేచినవేళ మంచిదిరా, తండ్రీ! ఆ గుంట వెధవతో కలిసి నువ్వూ వానలోకి వెళ్ళాపుకాదు, ఎంతలేసి ప్రమాదం తెచ్చేవాడివో!' అంటూ ఆ పసివాడి నునులేత పెదవులపై అదేపనిగా ముద్దు పెట్టుకో సాగింది.

'ఎవరికీ ఏ ప్రమాదమూ జరగలేదుకదండీ! ఊరుకోండి, ఊరుకోండి,' అంటూ సుందరమ్మ, విశాలాక్షిని సముదాయించడానికి ప్రయత్నించింది.

అట్లా సముదాయింపులతో, హఠాత్ సంఘటనతో ప్రారంభమైన వాళ్ళ పరిచయం, కొన్ని రోజులకు నీడలు సాగింది. వచ్చినప్పుడల్లా ఆ దంపతులు బంగారుకొండకు, విస్సుకు రకరకాల తినుబండారాలు తెచ్చే వారు. కొత్తగుడ్డలు కొనుక్కొచ్చేవారు. ఆటబొమ్మలు పట్టుకొచ్చేవారు. మొదట మొదట అవేవీ అక్కర్లేదంటూ బంగారుకొండ మొరాయించాడు. కానీ, 'తీసుకో, నాన్నా, తప్పులేదు' అని విశాలాక్షి ప్రోత్సహించడంతో ఆ తరవాత యథేచ్ఛగా వాటిని స్వీకరించాడు. విస్సుకు మొదటినుంచీ నిగ్రహానుగ్రహాలు లేకపోవడంతో, జానకమ్మ అసలు రంగంలోకి రావల సిన అవసరమే లేకపోయింది. ఒక రోజున 'ఇవన్నీ ఎక్కడివిరా?' అని

విస్సు నడిగితే, ఎదురింటివాళ్ళవని వాడు సమాధానం చెప్పగానే కాబోలను కొని ఊరుకొంది.

ఓ సాయంకాలం మామూలుగానే ఆ పిల్లలిద్దర్నీ చూసి, కబుర్లు చెప్పి, బహుమతులిచ్చి ఇంటికి తిరిగివచ్చిన తరవాత డబుల్‌కాట్ డన్‌లప్ పరుపుమీద భర్త ప్రక్కనే పడుకుని, అగరువత్తుల ధూమమాలలు మంద మందంగా తేలిపోతున్న మధుర సమయంలో జగన్నాథం జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి ప్రేమగా సర్దుతూ, అతని చొక్కాగుండీలను గోముగా సవరిస్తూ, సగం కొరికిన తాంబూలాన్ని మోహనంగా అతనికి అందిస్తూ, 'నా దో చిన్న కోరిక!' అన్నది సుందరమ్మ. సిగ్గుసిగ్గుగా, మెల్లమెల్లగా.

'కోరిక కాదు, ఆజ్ఞ అనాలి దేవేరివారు. అవధారు, ఆనతిండు, ఈ దీనుడు శిరోధార్యముగా గ్రహింపగలడు' అన్నాడు జగన్నాథం. ఆమె చెంపల తళుకుకూ, పెదిమల నునుపుకూ పులకరించిపోతూ.

సుందరమ్మ జగన్నాథానికి ఇంకా దగ్గరగా జరిగింది. ఆమె ఎత్తై వక్షం అతని ఉచ్ఛ్వాస విశ్వాసాలకు చలిస్తూంది. అతని చెవిలో నోరుపెట్టి రహస్యం చెబుతున్నట్లుగా అన్నది. 'విశాలాక్షిగారి బంగారు కొండను చూశారుకదూ?'

'చూడడమేకాదు, నా చిలకలకొలికీ, ఆ చిన్నవాణ్ణి ఎత్తుకున్నాను. ముద్దులాడాను. ముద్దుమాటలాడాను.'

సుందరమ్మ గభాలున అన్నది: 'వాణ్ణి మనం పెంచుకుందామండీ!'

ఆ మాట విని జగన్నాథం నవ్వుతో లుంగలుచుట్టుకుపోయాడు. 'ఏమిటీ ...పెంచుకోవడమా, మళ్ళీ అను. పెం....చు ...కో....వ....డ.... మా....' అంటూ తెరలు తెరలుగా నవ్వాడు. 'ఎక్సలెంట్ జోక్' అంటూ నవ్వలేక పొట్ట పట్టుకున్నాడు.

సుందరమ్మ దీనంగా 'జోక్ కాదండీ! సీరియస్‌గానే చెబుతున్నాను. వాణ్ణి పెంచుకోవాలనే ఉందండీ!' అన్నది.

'ఎందుకూ? —మన కేమంత వయసు మించిపోయిందనీ! కావాలంటే మరొక్క ఏడాదికల్లా నువ్వే ఎత్తుకుంటావు, పనసపండులాంటి కన్నబిడ్డను.'

సుందరమ్మ బుగ్గలు సిగ్గులమొగ్గలు తొడిగాయి. 'అదే నిజం కానీండి' అన్నది వినబడీ వినబడకుండా. 'అయితే మాత్రమేం, ఆ బంగారు కొండా మనదగ్గరే ఉంటాడు. వాడి పాలబుగ్గలు, నల్లనిజుత్తు, ఆరోగ్యకరమైన వాడిఒళ్లు .. జపాన్ బొమ్మలా ఉంటాడండీ ఆ చంటినాగన్న!'

జగన్నాథం సుందరమ్మ వేపు కొన్ని క్షణాలు అర్థంకానట్లు చూశాడు. ఆ తరువాత బరువుగా నిట్టూర్చి, 'ఓ. కె. యువర్ విల్. ఇంతవరకు నువ్వు చెప్పింది నే నెప్పుడూ కాదనలేదు. వై షుడ్ ఐ డిజప్పాయింట్ యూ నౌ?' అన్నాడు.

ఆ రాత్రి రంగు రంగుల కలలుకంటూ సుందరమ్మ నిద్రబోయింది. ఆ కలల్లో అందాల పసిపిల్లలు ఆమెచుట్టూ నాట్యం చేశారు. మరునాడు ప్రొద్దున్న నాట్యం చేస్తున్నట్లుగానే అన్ని పనులూ పూర్తిచేసుకుని, భర్తతో కలిసి ఆమె విశాలాక్షి ఇంటికి వెళ్ళింది. మామూలు కుశల ప్రశ్నలుకూడా ముగియకుండానే, ఆత్రుత ఆపుకోలేక, 'అక్కగారూ! మీ బంగారుకొండను మేం తీసుకు వెళ్ళిపోవడానికి వచ్చాం' అన్నది.

ఆ మాటవిన్న విశాలాక్షి ఉలిక్కిపడింది. 'ఎక్కడికీ?' అన్నది భయం భయంగా.

'మా ఇంటికే!'

'ఎందుకూ?'

'పెంచుకోవడానికి.'

'పెంచుకోవడమేమిటీ?' విశాలాక్షికి అసలు విషయం అంతుబట్టకుండా ఉంది.

కుర్చీలో కూర్చున్నవాడల్లా, చదువుతున్న పేపరు అవతల పెట్టి అప్పుడు జగన్నాథం ముందుకు వచ్చాడు. 'అది కాదండీ, వదినగారూ! సుందరికి చెప్పడం చేతకాలేదు. మీ అబ్బాయిని మేం దత్తు చేసుకో దలుచుకున్నాం,'

'దత్తా ?' విశాలాక్షికి ఆ మాట నిజమో, అబద్ధమో తెలియలేదు.

'అవును, దత్తు చేసుకుంటాం. నాకీ ఊళ్ళో నాలుగు మేడలున్నాయి' నలభై ఎకరాల పల్లపుపొలం ఉంది. పాడిగేదెలాంటి మునిసిపల్ కౌన్సిల్ మెంబర్ షిప్ ఉంది. ఒక నూనెమిల్లు, ఒక బియ్యంమిల్లు ఉన్నాయి. చేతిలో అంబాసడర్ కారు ఉంది. ఫారిన్ బ్యూక్ కారు కోసం ప్రయత్నం చేస్తు న్నాను. యూనిట్ ట్రస్టువారి యూనిట్లు కొన్నాను. ప్రభుత్వంవారు అడపా దడపా ప్రకటించే ఋణాలకు టాక్సు ఉండదుకదా అని మదుపు పెట్టాను. రేపు ఎమ్. ఎల్. ఏ సీటుకోసం దరఖాస్తు చేయాలనుకుంటున్నాను. నా దగ్గర మీవాడుంటే దేశానికి నాయకుడన్నా అవుతాడు, లక్షాధికారన్నా అవు తాడు. కాకపోతే కనీసం కలెక్టరన్నా అవుతాడు.'

జగన్నాథం ఆ మాటలు మాట్లాడుతున్నంతసేపూ విశాలాక్షి తలపట్టు కుని కూచుంది. అతను మాట్లాడ్డం పూర్తికాగానే, 'అయినా సరే, వాణ్ణి నేను వదులుకోను. నా బంగారుకొండను వదిలి నే ఉండలేను. వాడు నాకు ఆరో ప్రాణం, నా జీవనజ్యోతి' అన్నది నీరసంగా.

సుందరమ్మకు ఆ మాటలు వినగానే విశాలాక్షిమీద వల్లమాలిన కోపం వచ్చింది.

'అట్లా అయితే ప్రతినెలా మూడు వందలకు తక్కువ కాకుండా మీకు పంపే ఏర్పాటు చేస్తాను. సరేనా ?' అన్నది తిరస్కారంతో.

విశాలాక్షి ఎర్రబడ్డ కళ్ళతో లేచి నించుంది. తూష్ణీభావంతో సుంద రమ్మవైపు చూసింది.

అయితే మూడు వందలకు నాకొడుకును కొనుక్కుంటావన్నమాట!' అన్నది. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. విశాలాక్షి గొంతు పెద్దది చేసింది. కొడుకుల్నమ్ముకొని బ్రతికే కసాయితల్లి ననుకొంటున్నారా మీరు నన్ను! వెళ్ళండి. తక్షణం వెళ్ళిపొండి ఈ ఇంట్లోనించి. నవమాసాలుమోసి, రక్త మాంసాలదించి, కళ్ళలో వత్తులు వేసుకుని పెంచి, ఇంతవాణ్ణి చేసిన నా బంగారుకొండను మీ పాపిష్టి డబ్బుకోసం, మీ ఆస్తికోసం, మీరు ఆశ పెట్టే సుఖాల బ్రతుకుకోసం అమ్ముకునే నీచురాలిక్రింద ఎందుకు లెక్క

వేశారు నన్ను! ఉన్నదే ముగ్గురు. ఆ ముగ్గురే నాకు బరువా? ఎమరింటి ప్లీడరుగుమాస్తా పెళ్ళాంవంటి ఎండిన బ్రతుకుకాదు మా ఆయన కోటీశ్వరుడు కాకపోయినా, కన్నవాళ్ళ కడుపాకలి తీర్చగల మధ్యతరగతి గృహస్థే! మాకు మీ మడిమాన్యాలక్కర్లేదు. కార్లూ, పదవులూ అక్కర్లేదు. వెళ్ళండి, వెళ్ళండి. నన్నూ, నా బిడ్డనూ వేరుచేయకండి. దయచేసి వెళ్ళిపొండి.' ఆమె కంటవెంట సంతతధారగా కన్నీరు కారిపోతూంది. ఆమె గొంతు వణికిపోతూంది.

జగన్నాథం పరిస్థితి అర్థం చేసుకున్నట్టు, 'సుందరీ, లెట్ అజ్ గో' అన్నాడు నిశ్చల కంఠంతో. సుందరమ్మకూడా నిరాశగా లేచి నిలబడింది. వాకిలిదాటి వీధి మధ్యకు వచ్చి, కారు ఎక్కబోయే టంతలో 'టా టా' అంటూ విస్సు కనిపించాడు ఎదురింటి పూరిపాకముందు నిలబడి. ఉదయం పూట ఎండ అతని మొహంమీదపడి, మెత్తగా క్రిందకు జారిపోతూంది. తలంటు పోసుకున్నా, వంకీలజుట్టు గాలిలో గారాలుపోతూంది. అతన్ని చూచి అక్కడే నిలబడ్డ జగన్నాథంలో అనుకోకుండా ఓ ఆలోచన కలిగింది.

'మై డియర్! ఆ బంగారుకొండను కాకపోతే, ఈ మెర్క్యురీ బల్బును పట్టుకుపోదాం. నీ కేమైనా అయిష్టమా.'

అప్పుడే దెబ్బతిన్న ఆమె హృదయంలో, 'ఆ గర్విష్ఠి విశాలాక్షికి అల్లాచేస్తే తగిన శాస్త్రీ అవుతుంది' అనిపించింది. కానీ జానకమ్మ తన కుర్రవాణ్ణి అంత సులభంగా ఇచ్చేస్తుందా? ఈవిడ చేతిలోనూ మళ్ళీ తాను అవమానం పొందాలా అనిపించింది ఆమెకు.

ఆమెమనసు నర్థం చేసుకొన్నట్లుగా, 'ప్రయత్నం చేద్దాం. ప్రయత్నం చెయ్యడంలో తప్పు లేదుగా ?' అంటూ జగన్నాథం ముందుకు నడిచాడు.

కానీ, వాళ్ళు భయపడ్డట్లుగా జానకమ్మ వాళ్ళను అవమానించలేదు. పైగా, ఎంతో మర్యాద చేసింది. వచ్చినపని తెలుసుకున్న తరవాత, కాసేపు ఆలోచించి, 'మీలాంటివారికి పెంపకం ఇయ్యడానికి మహారాజుగా ఇయ్యవచ్చు. అభ్యంతరం ఏం ఉంటుంది కానీండి, కొన్నాళ్ళు పోయిన తరవాత....'

ఆమె మాటను అర్థంచేసుకొన్నట్లుగా మధ్యలోనే అందుకొంది సుందరమ్మ. 'విస్సు మా ఇంటికి వచ్చిన తరవాత ఒకవేళ నాకు పిల్లలు కలిగినా, వాడే మా ఇంటికి, మా ఆస్తికి పెద్దబిడ్డ. సరేనా? అనుమానం తీరేనా?'

జానకమ్మ మనస్ఫూర్తిగా నవ్వింది. 'వాణ్ణి మీరు పెద్దబిడ్డను చేసుకుంటానంటే ఇంకా నేనెందుకు కాదంటానూ? ఇంటి యజమానిని రానీండి, ఆయననుకూడా ఒప్పించి ఆ తరవాత విస్సును మీ వాణ్ణి చేసుకోవచ్చు.'

జానకమ్మ, ఆ పూరింటి వసారాలో నిలబడి, పెంకుటింటి వరండాలో నిలబడ్డ విశాలాక్షివేపు విజయగర్వంతో చూసింది. విశాలాక్షి బంగారు కొండను ముద్దులాడుతూ—'ఎంత ప్రమాదం తప్పిపోయింది!' అను కొంటూ రిలీఫ్ మూలాన కలిగిన సంతోషంతో కన్నీరు కారుస్తూంది.

*　　*　　*

ఆకాశంమీద నల్లమబ్బు వేసింది. చినుకు చినుకుగా ప్రారంభమైన వాన, గాఢమై కురవసాగింది. రెయిన్‌కోట్లు తొడుక్కునీ, ఫెల్ట్ హాట్లు మొహంమీదకు లాక్కునీ, రబ్బరు బూట్లలో జనం తారురోడ్లమీద జారిపో తున్నారు. అక్కడో ఆగామి కాకి కావు కావు మన్న కేకా, కాకా హోటల్లోనుంచి వివిధభారతి నుండి ఉదయంపూట వినవచ్చే హిందీపాటా, ఇక్కడో గుడ్డివాడు క్రైస్తవ గీతం పాడుతూ దీనంగా చేయిజాపి చేసే యాచనా—ఆ సందు ముగదల వర్షపు జల్లుతో కలిసి నీరసత్వాన్ని ప్రవేశ పెడుతున్నాయి.

విశాలాక్షి చీరచెరగు తలనిండా లాక్కుంటూ, తన మూడుగదుల పెంకుటింటి వరండాలో గువ్వపిట్టలా ముడుచుకుని కూచుంది. లోపల ఏ గది లోనూ సూదిమొన మోపినంత స్థలం పొడిగాలేదు. చాలాచోట్ల పెంకులు లేచిపోయాయి. గోడలు పెచ్చులూడిపోతున్నాయి. కోడలుపిల్ల కాపరానికి వచ్చిందిమొదలూ ఈసురోమంటూ మూలగడమేతప్ప, పట్టుమని పక్కున నవ్విన క్షణం ఒక్కటైనా కనబడదు. తను కట్టుకున్న మనిషి, తన కళ్ళ ముందే తనను ఒంటరిదాన్నిచేసి పోయాడు. తనుకున్న సంతానమూ తనకు దక్కలేదు. విశాలాక్షి లోలోపల గొణుక్కుంది. 'ఎవరి ఋణం తీర్చుకుని

వాళ్ళు చక్కా పోయారు. పోయిన వాళ్ళెప్పుడూ మనవాళ్ళు గారు. వాళ్ళను గూర్చిన చింత ఎందుకు? తన బంగారుకొండను తను అస్తారుప్రదంగా పెంచింది తన మొర ఆలకించినట్లుగా ఆ భగవంతుడు తన కా బంగారు కొండనే మిగిల్చి, మిగిలినవాళ్ళను తన దగ్గరకు రప్పించుకున్నాడు. తన బంగారుకొండ క్షేమమై మెలిగితేచాలు, తన కంటి దీపమై వెలిగితేచాలు, తమ తల్లీ—బిడ్డల అనుబంధం శాశ్వతమై మనగలిగితే తనకంతేచాలు.'

తన ఆలోచనల ప్రపంచంలో తాను మునిగి, విశాలాక్షి లోపలినుండి బంగారుకొండ బయటకు రావడం చూడలేదు. బంగారుకొండ భుజంమీద చిన్నవాణ్ణొకణ్ణి పరుండబెట్టుకొని వాకిట్లోకి వచ్చాడు. ఆ చిన్నవాడి కళ్ళు ఏడ్చి ఏడ్చి ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. వాడు సన్నగా, పుల్లగా ఉన్నాడు. జుట్టు పీచులు పీచులుగా రేగి ఉంది. చేతికి తాయెత్తు ఉంది. మెళ్ళో నల్లదారం ఉంది.

'అమ్మా! ఈ వెధవను కాసేపు పట్టుకోవే! పాలకోసం దాని ప్రాణం తీస్తున్నాడు. నా దగ్గర పాలులేవు మొర్రో అంటుందది.. గేదె పాలీ వెధవకు పడిచావదు. ఎట్లా చచ్చేదేనేను?'

విశాలాక్షి తలఎత్తి తన బంగారుకొండవేపు చూసింది. మసక మసగ్గా అత నామె కళ్ళకు కన్పిస్తున్నాడు. గడ్డం మాసిపోయింది. కళ్ళు గుంటలుపడ్డాయి. జుట్టు పెరిగి తలమీద జీబురుగా ఉంది. మొహమంతా నల్లకప్పువేసి ఉంది. ఆమె గుండె కలుక్కుమంది. 'అట్లా ఉన్నావెందుకు, తండ్రీ!' అని అనడానికి ఆమెకు ఎందుకనో ధైర్యం చాలలేదు.

'బజార్లో ఏవో పాలడబ్బాలు దొరుకుతున్నాయట కదూ, నానీ!'

'ఆ దొరుకుతున్నాయి. ఎందుకు దొరకవూ? డబ్బు పోస్తే కావలసి నన్ని. కానీ ఆ డబ్బేదీ?—ఆ డబ్బే ఉంటే మాసికలు కుట్టిన ఈ చొక్కా లెందుకు తొడుక్కు తిరుగుతాన్నేనూ? ఏం బ్రతుకే నాది? ఇదీ ఒక బ్రతు కేనా? గానుగెద్దు బ్రతుకు. కుక్క బ్రతుకు. తెచ్చిన జీతం నెలలో మొదటి వారానికన్నా చాలని బ్రతుకు. కన్నతల్లినీ, కట్టుకున్న పెళ్ళాన్నీ పోషించ లేని బ్రతుకు.' అతను లేచివెళ్ళి గుమ్మం దగ్గర కూలబడ్డాడు. అతని

కళ్ళలో నీళ్ళు చిమ్మాయి కొడుకు అవస్థ చూసి విశాలాక్షి గుండె తరుక్కు-పోయింది. మనమణ్ణి మెల్లగా ఒళ్ళోనుండి క్రిందకు దింపి కూచోపెట్టింది. అట్లాగే లేచి నిలబడి బలహీనంగా అడుగులు వేసుకుంటూ కొడుకు దగ్గరకు చేరింది. అతన్ని రెండుచేతులతోనూ పొదివి పట్టుకుంది. అతని జుట్టు సవరించింది. 'పిచ్చితండ్రీ! బాధపడతావెందుకురా! బాధ్యతల భారం ఎక్కువైతే అట్లా క్రుంగిపోతారుట్రా! మీ తాత లీ బరువు మోశారు. మీ నాన్న ఈ బరువు మోశారు. ఇప్పుడు నువ్వు మోస్తున్నావు. రేపు నీ కొడుకు మోస్తాడు. ఇది ఇట్లా అవిచ్ఛిన్నంగా సాగేదేరా !'

ఇంతలో లోపలినుండి కోడలుపిల్ల గొంతు బలహీనంగా విన వచ్చింది. 'ఏమండీ! ఒకసారిట్టారండీ!'

'వస్తున్నా, తల్లీ!' అంటూ విశాలాక్షి మెల్లగా గుమ్మం పట్టుకు లేవబోయింది.

'నువ్వొద్దు ఉండవే! నే వెళ్ళి కనుక్కుంటాను.'

అతను అటు లోపలికి వెళ్ళిపోయిన తరవాత విశాలాక్షికి మనమడు జ్ఞాపకం వచ్చాడు. 'చిట్టీ! చిట్టీ! ఒరేయ్, చిట్టీ!' అంటూ కేకవేసింది. అప్పటికే ఆ చిన్నవాడు మెట్లుదిగి మెల్లగా వీథిలోకి వెళ్ళిపోతున్నాడు. వర్షపు చినుకుల్లో తడవడం వాడికి మహా హుషారుగా ఉంది. కాళ్ళతో తప తప రోడ్డుమీద నీళ్ళను చిందర వందర చేస్తున్నాడు. అంతలో కాలు జారి క్రిందపడి, ఏడవకుండా పకపక నవ్వుతున్నాడు. నవ్వుతూ మళ్ళీ నీళ్ళను నలుప్రక్కలా చిమ్మేస్తున్నాడు. చిమ్మేస్తూ రోడ్డుమధ్యకు చేరు కున్నాడు. కసురుకుంటూ, విసురుకుంటూ, 'ఎవరి కుర్రాడితడు' అను కొంటూ తప్పించుకుపోతున్నారు చుట్టుప్రక్కల మనుషులు. ఇంతలో ఓ సరికొత్త మోడల్ ఫియట్ కారు అతి దూకుడుగా వస్తూ, పిల్లవాణ్ణి చూచి అకస్మాత్తుగా బ్రేక్ వేసి 'క్రీక్' మంటూ ఆగిపోయింది.

కారులో వెనకసీట్లో కూర్చున్న అందమైన యువతీయువకులిద్దరు ఆ హఠాత్ సంఘటనకు ఒకరి ఒళ్లో మరొకరు తూలిపడ్డారు. అ యువకుడి నోట్లో వెలుగుతున్న త్రీఫైవ్స్ సిగరెట్టు సుతారంగా యువతి చెంపను తాకి, గగుర్పాటుతో క్రిందపడ్డది.

'అబ్బా!' అంది ఆ యువతి, చెంపను నిమురుకొంటూ, ఆ యువకుని స్పర్శమూలాన కలిగిన పులకలను పైకి కనబడనీయకుండా.

ఆ యువకుడు మెల్లగా ఆమె చెవిలో అన్నాడు: 'నాకు పట్టని అదృష్టం నా సిగరెట్టుకు పట్టింది.

ఆ యువతి అంతటి బాధలోనూ ఫక్కున నవ్వింది 'యూ నాటీ బోయ్' అన్నది.

ఆ తరవాత డ్రైవరు వేపుకు తిరిగి, 'ఏం జరిగిందోయ్?' అన్నది పరుషంగా.

'ఎవడో చిన్న కుర్రాడమ్మా! కారుక్రింద పడబోయాడు.' ఆ యువతి ఆ మాటవిని కంగారుగా కారు దిగబోయింది. ఆ యువకుడామె రెక్క పుచ్చుకొని ఆపుచేశాడు.

'పారూ! పడబోయన కుర్రాణ్ణి చూసేదేమిటీలెద్దూ! పడ్డతరవాత నైతే పరిహారం సంగతి ఆలోచించవలసి వచ్చేది! డ్రైవర్, పోనీ.'

డ్రైవరు కారు స్టార్టు చేయబోయాడు. ఇంతలో విశాలాక్షి ఆయాస పడుతూ అక్కడకు తడబడుతున్న అడుగులతో తొందర తొందరగా వచ్చి, కుర్రవాణ్ణి గభాలున చంకనేసుకుంది. 'నా నాయనే! నా బాబే! ఎంతగండం తప్పిందిరా ఈ వేళ నీకు!' అంటూ వాణ్ణి ముద్దులతో నింపివేసింది. ఆ తరవాత కారువేపు తిరిగి, 'ఎవరయ్యా కార్లో? పిల్లలూ, పాడిగొడ్లూ రోడ్డు మీద నడుస్తుంటాయని కాస్త గుర్తుంచుకొని కారునడపండి మరీ!' అంటూ హెచ్చరిక పలికింది.

ఆ యువకుడు అమెవేపు కుతూహలంగా చూశాడు. ఎదురింటి పాత బడ్డ పెంకుటింటివేపు చూశాడు. ఏదో జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్లుగా కాసేపు ఆగి, 'డ్రైవర్! కారు ఆ ప్రక్కన ఆపుచెయ్! పారూ, కారు దిగు. ఐ విల్ షో యూ సంథింగ్' అన్నాడు.

విశాలాక్షి మనమణ్ణి తీసుకొని వరండాలోకి వచ్చేసిందేకాని, వెనగ్గా వచ్చిన ఆ ఇద్దర్నీ గమనించనేలేదు. తీరా గమనించి, ఎవరో తెలుసుకున్న తరవాత ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకుంటూ, 'ఓరీ విస్సూ! ఎంత

వాడి వెంతపయ్యావురా! ఈ అమ్మాయి ఎవరూ. నీ పెళ్ళామా? చక్కగా ఉందిరా—కుందనపు బొమ్మలాగు' అన్నది.

విస్సు సమాధానం చెప్పేటంతలో, బంగారుకొండ, 'ఏమిటే, అమ్మా! ఎవరితోటే మాట్లాడుతున్నావ్?' అంటూ లోపలినుంచి బయటకు వచ్చాడు.

ఎదురుగా మెరుపు తీగల్లా ఉన్న రెండు సౌందర్య స్వరూపాల్ని చూసి దిగ్భ్రమతో ఒక అడుగువేసి నిలబడిపోయాడు. విశాలాక్షి, చీర కొంగుతో మనమడి తల, ఒళ్ళు తుడుస్తూ—'అక్కడే ఆగిపోయావేరా, వెర్రినాగన్నా! మన విస్సేరా వీడు! చిన్నప్పుడు నీతో కలిసి ఆడుకోలేదూ—వాడూ, వాడి పెళ్ళామూనూ!' అన్నది నోటినిండుగా నవ్వుతూ.

ఆమెను కరెక్ట్ చేస్తున్నట్టుగా అన్నాడు విస్సు: 'షి ఈజ్ ఓన్లీ మై గర్ల్ ఫ్రెండ్, మిస్ పార్వతి.' పార్వతివేపు తిరిగి అన్నాడు. 'పారూ, వీడు — ఇదిగో .... ఈవిడకొడుకు. బంగారుకొండ, అంటూ ముద్దుగా పిలుచుకొంటుందావిడ. పేరేమిటో నాకూ జ్ఞాపకంలేదుమరి!'

బంగారుకొండ విస్సు చెప్పిన మాటలను లోలోపల మననం చేసుకుంటున్నాడు. 'ఎంత అందంగా ఉందిరా నీ గర్ల్ ఫ్రెండ్! నాకూ గర్ల్ ఫ్రెండ్స్‌తో స్నేహంచేయాలనీ, కార్లలో, బీచీల్లో వాళ్ళను వెంటేసుకుని తిరగాలనీ ఉంటుందిరా. కానీ ఈ కోన్‌కిస్కాతో ఎవరొస్తార్రా? నాపెళ్ళామే నాతోరాదు' అనుకొంటున్నాడు. అతను మళ్ళీ విస్సు వేపు చూశాడు. 'అవున్రా! నా పేరు నాకూ జ్ఞాపకంలేదు. నన్ను చిన్నప్పటినుంచీ బంగారుకొండలాగా, రాజాలాగా, పెంచిందిరా! కానీ నేనే ఎందుకూ పనికిమాలిన వాణ్ణయినాను. సంపాదన చేతకాని వాణ్ణయినాను. పెళ్ళాం బిడ్డల్ని పోషించలేని వాణ్ణయినాను' అనిపించిందతని మనస్సులో. ఆ మాటలే అతను పైకి అనాలని అనుకొన్నాడు. కానీ మధ్యతరగతి మర్యాద అతని గొంతు నొక్కింది.

'ఏమండీ, పిన్నిగారూ, వీడెవడు—బంగారుకొండ కొడుకేనే!' అంటున్నాడు మళ్ళీ విస్సు.

'అపుర్నా! నా కొడుకే! మై యంగ్ ప్రిన్స్! కాపీ అట్లా సన్నగా, కళ్ళలో ప్రాణాలతో ఉన్నాడేమా అనేనా నీ సందేహం, వాడు—గుమాస్తా కొడుకురా. తల్లిపాలమీద పెరగనివాడ్రా!' అందామనుకున్నాడు బంగారు కొండ.

కానీ విశాలాక్షి సమాధానం చెప్పడంతో అతను మౌనం వహించాడు. 'అపుర్నా, విస్సూ! వీడు నా మనుమడే! నెలలు రాకముందే పుట్టడంతో వీడిట్లా అర్భకంగా తయారైనాడు.'

'వీళ్ళు మనను కూచోమనరేమీ?' అన్నట్టు చూస్తోంది పార్వతి అటూ ఇటూ. విశాలాక్షి కొంతసేపటికి ఓ చిరుగుల చాప ఒకటి తీసుకు వచ్చి వేసింది.

'మీ కోడలేదండీ?' అన్నది పార్వతి మళ్ళీ.

'దాని ఒంట్లో ఆరోగ్యం అంత సనిగా ఉండదమ్మా! అందుకని ఆ గదిలోనుంచి అది బయటికేరాదు.' అన్నది విశాలాక్షి సంజాయిషీ చెప్పు కొంటున్నట్లుగా.

నేరోకట్ టెరిలిన్ ప్యాంటుతో చాపమీద చతికిల బడడానికి విస్సు సంశయిస్తుండడం చూసి ఓపాత కొయ్యకుర్చీ తెచ్చివేశాడు బంగారుకొండ ఆ వరండాలో, బయట వర్షం తగ్గుముఖంపట్టే సూచనలు కనిపిస్తున్నాయి. రోడ్డుమీద రద్దీ మళ్ళీ ఎక్కువౌతున్నది.

విశాలాక్షి చొరవచేసి అడిగింది: 'నీ గురించి కొన్ని సంగతులు చెప్పరా విస్సూ!'

'ఏముంది, పిన్నీ! మా అమ్మ నన్ను జగన్నాథం గారికి దత్తు ఇచ్చిన సంగతి నీకు తెలిసిందే కదా! అట్లా ఇయ్యడం మూలంగానే నాకీ అదృష్టం పట్టింది. మా జనకతండ్రీ, జనకతల్లీ కూడా నా దగ్గరకే వచ్చే శారు. ఇప్పుడందరం కలిసే ఉంటున్నాం.'

'జగన్నాథంగారెక్కడ ఉంటున్నారు?'

'ఒకచోట ఎక్కడని చెప్పను పిన్నీ! ఉదయం బొంబాయిలో ఉంటారు, సాయంకాలం కలకత్తా చేరుకుంటారు. త్రివేంద్రంలో మాకు ఇండస్ట్రీస్ ఉన్నాయి. ఢిల్లీలో పార్లమెంటు మెంబర్లకు అవసరమైతే మేం అప్పులిస్తాం. ఊటీలో, డార్జిలింగ్‌లో ఎస్టేట్స్ సంపాయించారు. నన్ను ఆయనకు పెంపుడిచ్చి, నిజంగా మా అమ్మ నాకు మహోపకారం చేసింది పిన్నీ!'

'ముందు నన్నే అడిగార్రా! కానీ నా బంగారుకొండను వదులుకోలేక పోయాను. పిల్లాణ్ణి అమ్ముకోవడం కద్రుట్రా, విస్సూ అది!'

ఆ మాట వినగానే బంగారుకొండ మొహం నల్లగా మాడిపోయింది విస్సువేపు చూశాడు. ఉదయపు కాంతిలో అప్పుడే విచ్చిన పొగడపువ్వులా అతి మోహనంగా ఉంది. అతను తొడుక్కున్న ప్యాంటుగుడ్డ ఖరీదుచేయదు తన నెలజీతం. తన బలహీనమైన గుండెకన్నా, అతని చేతికి ఉన్న బ్లాక్ డయల్ వాచీ ఎక్కువ బలంగా కొట్టుకొంటుంది. అతని మనసు లోపల ఒక బలహీనత పొటమరించింది. 'తను అతని స్థానంలో ఉండ వలసినవాడు. ఆ మహాదృష్టానికి తను వారసుడు కావలసినవాడు. అప్పుడు విస్సు తనలాగా, జిడ్డోడుతున్న మొహంతో, జీవితంలో ఆనందం లవ లేశం కూడా లేక జీవచ్ఛవంలా బ్రతుకు బరువు లాగేవాడా?

విస్సు చెప్పుకుపోతున్నాడు: 'అమ్మితేమాత్రం ఏం, పిన్నీ! అమ్మ బడ్డవాళ్ళకూ, కొన్నవాళ్ళకూ, అమ్మినవాళ్ళకూ కూడా లాభదాయకమైన బేరం ఇది. మార్కులతో నిమిత్తం లేకుండానే పరీక్షలన్నీ ఫస్టున పాసై నాను. పదివేలు పారేసి ప్రొఫెషనల్ కాలేజీలో సీటు కొనుక్కున్నాను. డిగ్రీ సంపాదించి, సరదాగా విదేశాలు తిరిగొచ్చాను.'

'ఇప్పుడెందు కిక్కడికి వచ్చినట్లు?' బంగారుకొండ అడగకుండా ఉండలేకపోయాడు.

'ఇక్కడ మా అమ్మా వాళ్లూ ఉన్న ఇంటిని, ఆ చుట్టుప్రక్క స్థలా లను మరామత్తుచేసి, కొన్ని లక్షలు ఖరీదుచేసే బిల్డింగు లిక్కడ కట్టించి వాటిలో ఓ జూనియర్ కాలేజీని మా అమ్మగారి పేరుమీద స్థాపిద్దామని.'

విశాలాక్షి కళ్ళు ఇంతలు చేసుకుని అతనివేపు చూసింది. తనతల్లి తనను నిర్దాక్షిణ్యంగా అమ్మివేసినా, ఆ తల్లిపేరుమీదనే విస్సు కాలేజీ కట్టిస్తున్నాడు. కొడుక్కి తల్లిమీద అంతటి తరగని ప్రేమ ఉంటుంది గామోసు! తనబంగారుకొండకూ తనమీద అంతటి ప్రేమా ఉంటుంది. తనే ఇంతవరకూ కానలేకపోయింది.

'ఇంక మేం వెళ్ళిరామా మరి ?'

విస్సు లేచి నిలబడ్డాడు.

'కాఫీ తాగి వెళ్ళండి, అనాలని నోటివరకూ వచ్చింది బంగారుకొండకు. కానీ ఇంతలోకి కొడుకు పాలకూ, ప్రొద్దున్న కాఫీలోకి కటకటైన విషయం జ్ఞాపకం వచ్చి, ఆ ప్రస్తావన మానుకున్నాడు. పోనీ' హోటలుకు వెళ్ళి తీసుకువద్దామా అని అనుకుంటున్నాడు, ఇవి నెలాఖరు రోజులు. 'అల్లాగే' అనికూడా అనలేక దిగాలుపడ్డ మొహంతో, వ్యథాభరిత హృదయంతో స్థాణువులా నిలుచుండిపోయాడు.

విస్సు లేచి నిలబడి, విశాలాక్షికి నమస్కరించి. బంగారుకొండ కొడుకు తలను ప్రేమగా నిమిరాడు. 'ఏరా, బంగారుకొండా, నీహయాంలోనయినా పెంకుటిల్లు మేడగా మారుస్తావా' అని నవ్వుతూ అని పర్సుతీసి ఓనోటుతీసి దాన్ని ఆ కుర్రవాడి జేబులోకుక్కి, 'టా, టా' అంటూ వరండా దిగి, పార్వతితోసహా కారు దగ్గరకు వెళ్ళిపోయాడు.

బయట వాన వెలుస్తూంది. ఇంట్లో వాన వెలిసినట్లయింది. విశాలాక్షి మనమడి చేతిలోఉన్న నోటునుచూసింది. 'ఒరే, నానీ! చూసుకోకుండా ఇచ్చినట్టున్నాడ్రా! ఇది వంద రూపాయల కాగితంరా !' అంది ఆశ్చర్యంతో తబ్బిబ్బవుతూ.

ఆ మాట విని క్రూరమృగం అమాయకపు లేడిమీదకు లంఘించినట్లుగా కుర్రవాడిమీదకు కలియబడి అతడా నోటును లాక్కున్నాడు. కోపంతో, అవమానంతో ఆతనికళ్ళు ఎర్రగా జ్వలిస్తున్నాయి. 'చూడకుండా ఇవ్వలేదే! చూసే ఇచ్చాడు. కావాలనే ఇచ్చాడు. మన పేదరికాన్ని అవహేళనం చేయాలని, మన బుద్ధితక్కువతనాన్ని ఎత్తి చూపాలని, నా అసమర్ధ

తను నా కళ్ళముందే నాకు చూపించాలని ఆ వందరూపాయల నోటును కుర్రవాడికి బహుమతిక్రింద ఇస్తున్నట్టుగా నటించి ఇక్కడ పారేశాడు. నేనూ పారేస్తాను! అవును-నాకూ ఆత్మాభిమానం ఉంది. డబ్బుకు దాసోహమనే మనిషిని కాదే నేను! అవమానాన్ని ఓర్చుకోనే నేను! ఆ వంద రూపాయల నోటును వాడి మొహంమీదనే పారేస్తాను' అంటూ అతను పిచ్చిగా వాకిట్లోకి పరిగెత్తాడు.

'నాన్నా! ఒరేయ్, తొందర పడకురా! లక్ష్మి నట్లా కాలదన్నకురా!' అంటూ విశాలాక్షి వెనకనుండి అరవడం మొదలెట్టింది. నాయనమ్మ అట్లా ఎందుకుఅరుస్తున్నదోతెలీక చిన్నవాడు ఆరున్నొక్కరాగం ప్రారంభించాడు.

అట్లా విపరీతమైన ఆవేశంలో రోడ్డుమీదకు పరుగెత్తిన బంగారుకొండ, అప్పుడే విస్సు ఎక్కిన ఫియట్ కారు స్టార్టు కావడం చూసి, ఆ నోటును బలంగా ఆందులోకి విసిరివేశాడు. కానీ ముందుకు పోయినకారును అనుసరించలేక, ఆ నోటు గాలివాలుకు ప్రక్క మురికి కాలువలో పడి, నీటి జాలుకు మళ్ళీ రోడ్డుమీదకు కొట్టుకొనివచ్చి తడిసిముద్దపడిపోయింది. నోటు విసిరి, ఉస్సురని నిట్టూర్చిన బంగారుకొండ అదిచూసి కసిగా దాన్ని చేతిలోకి తీసుకుని, ముక్కలు ముక్కలుచేసి, గాలిలోకి విసిరివేశాడు. వంద రూపాయలనోటు వేయిముక్కలై గాలిలో తేలి, నీటిబరువుకు రోడ్డుమీద చిందరవందరగా పడి నలుదెసలా చెదిరిపోయాయి.

చెదిరిపోతున్నంతసేపూ బంగారుకొండ అక్కడే నిలబడి ఆ వంద రూపాయల ముక్కలను తదేకంగా చూశాడు. ఆ తరువాత ఆవేశపు తొలి ఉధృతం తగ్గిన తరవాత అతనిలో నీరసం ప్రవేశించింది. బరువుగా అడుగులు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు.

'ఏమిటి నాన్నా, అలా చేశావ్?' అన్నది విశాలాక్షి నిష్ఠూరంగా. 'పచ్చకాగితాన్నట్లా పదిముక్కలు చేయకూడదు, బాబూ!'

అత నామెవేపు అభావంతో ఒక్కక్షణం చూశాడు. క్రమక్రమంగా అభావం ఉన్నచోట కోపం, జుగుప్స గూడుకట్టుకున్నాయి. 'నా జీవితాన్నే నువ్వు ముక్కలు చేశావు. అది నీకు బాధగా లేదా?'

'నేనా?' విశాలాక్షి ఆశ్చర్యంతో అడిగింది. 'నిన్ను నా బంగారు కొండగా పెంచానే!'

'బంగారుకొండను చేద్దామనే పెంచావు. కానీ అవకాశం వచ్చి నప్పుడు నీ చేతులతో నువ్వే దాన్ని తుంచేశావు. నీ స్వార్థంకోసం నన్నుబలి పెట్టావు. నువ్వు అమ్మవు కావు—నా పాలిటి శాపానివి.'

'బాబూ!' పెద్దగా అరిచింది విశాలాక్షి.

'అవును. స్వార్థంలో కొడుకు భవిష్యత్తును, నూరేళ్ళ బంగారు స్వప్నాన్ని మంటగలిపిన రాక్షసివి నువ్వు. రాజకుమారుడు కావలసినవాణ్ణి క్లాస్ త్రీ ఎంప్లాయిని చేశావు. నిన్ను నేనెట్లా క్షమించను? నువ్వు కనిపించి నప్పుడల్లా, నువ్వు చేసిన అన్యాయమే నాకు గుర్తుకు వస్తుంది. నా గుండె పోగొట్టుకున్న సంపదను గూర్చిన చింతతో మండి పోతుంది. అమ్మా! అమ్మా! నువ్వట్లా ఎందుకు చేశావమ్మా!'

అప్పటికే అతని అమ్మ చేతనరహితంగా పడిపోయిందన్న సంగతి అతనికి జ్ఞాపకం రావడం లేదు. ఎదుట కట్టెలాంటి ఆ ముసలివరుగుబడుగు శరీరం అతనికి కనిపించడం లేదు. ఆ కట్టెమీద నాలుగేళ్ళ పసిబిడ్డ అటూ ఇటూ తిరుగుతూ ఆడుకుంటూంది. ఆ పసిబిడ్డ మొహంమీద తల్లిబిడ్డల అను బంధాన్ని సమస్తాన్నీ అవహేళనం చేసే ఆధునిక నిర్లక్ష్యమేదో ద్యోతమాన మౌతూంది. బయట వానతగ్గి ఎండ అప్పుడే మబ్బులనుండి బయట పడు తూంది. దూరంగా ఎవడో బైరాగి గీతాలు పాడటం లీలగా వినిపిస్తూంది.